2022లో 'ఆర్ఆర్ఆర్' నాటు దెబ్బకు.. ఇండియా అంతా షేక్ అయింది. 2023... 'సలార్' కటౌట్ నమ్ముకుని పర్లేదు అనిపించుకుంది. 2024 వీటన్నిటికీ మించి.. ఒకటి కాదు, రెండు కాదు.. నాలుగు పాన్ ఇండియా సినిమాలతో దుమ్మురేపింది. 'కల్కి' టాలీవుడ్ కోటలో హాలీవుడ్ రేంజ్‌ను చూపించింది. 'హను-మాన్' వసూళ్లలో జై బజరంగబలీ అనిపించుకుంది. 'దేవర' వారెవ్వా! చివరగా వచ్చిన 'పుష్ప-2' కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ రప్ప రప్ప ఆడేస్తున్నది. ఈ 2024 విజయాలు మాత్రమే కాదు... అంతకుమించిన వివాదాలనూ ఇచ్చింది. ఎప్పటిలాగే పరాజయాలనూ సమర్పించింది. 250 పైచిలుకు సినిమాలు విడుదలైతే.. వాటిలో విజయాలు పాతికలోపే. మొత్తంగా 2024 చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఆ సందడిని ఓసారి గుర్తు చేసుకుందాం.

నాటు కన్నా ఘాటు 2024

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప-2' బాక్సాఫీస్ రికార్డుల్ని తిరగరాస్తున్నది. నాన్ 'బాహుబలి' రికార్డులన్నిటినీ బద్దలు కొట్టి.. 'బాహుబలి' లక్ష్యంగా దూసుకుపోతున్నది. 'బాహుబలి 2' రూ.1850కోట్ల వసూళ్లతో భారత్‌లోనే రెండో స్థానంలో ఉంటే.. 'పుష్ప-2' రూ.1705 కోట్ల మార్క్‌ను 21రోజుల్లోనే దాటేసింది. మరి ఈ వేగం ఇలాగే కొనసాగితే.. బాహుబలి రికార్డ్ బద్దలవ్వడానికి మరెన్నో రోజులు పట్టదు. ఈ ఏడాది విడుదలైన బ్లాక్‌బస్టర్ నంబర్ 2 'కల్కి 2898ఏడి'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ నిర్మించిన ఈ సినిమా రూ.600 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ.1200 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఫ్రాంచైజీల్లో ఫస్ట్ పార్ట్ ఇంత కలెక్ట్ చేయడం ఆలిండియా రికార్డ్. ఇక ఈ ఏడాది టాలీవుడ్‌లో వసూళ్ల పరంగా మూడో స్థానంలో నిలిచిన చిత్రం 'దేవర'. రూ.300 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.600 కోట్ల వసూళ్లను రాబట్టి నిర్మాతకు డబుల్ ప్రాఫిట్‌ని కట్టబెట్టింది. సోలో హీరోగా ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది నంబర్‌వన్ హిట్. స్టార్ హీరో లేకుండా పాన్ ఇండియా రేంజ్‌లో రూ.350 కోట్లు కొల్లగొట్టిన సినిమా 'హను-మాన్'. కేవలం రూ.40 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన 'హను-మాన్'.. దేశవ్యాప్తంగా సంచలన విజయాన్ని నమోదు చేసింది. తేజ సజ్జా హీరోగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ ఏడాది టాప్ 4 హిట్.

ఇక పాన్ ఇండియా కాకుండా, కేవలం రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే మంచి వసూళ్లను అందుకున్న బ్లాక్‌బస్టర్స్ అంటే.. ముందుగా చెప్పుకోవాల్సిన సినిమా 'టిల్లు స్క్వేర్'. సిద్ధు జొన్నలగడ్డ కెరీర్‌లో వసూళ్లపరంగా వందకోట్ల మార్క్‌ను దాటిన తొలి సినిమా ఇది. తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కి, దాదాపు రూ.135 కోట్ల వసూళ్లను రాబట్టి ఈ ఏడాది టాప్ 5 హిట్‌గా నిలిచింది 'టిల్లు స్క్వేర్'. ఇతర భాషకు చెందిన నటుడు తెలుగులో హీరోగా నటించి, వందకోట్ల పైచిలుకు వసూళ్లను సాధించడం దుల్కర్ సల్మాన్ విషయంలోనే జరిగింది. దుల్కర్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన 'లక్కీ భాస్కర్' రూ. 110కోట్ల వసూళ్లను రాబట్టి ఈ ఏడాది టాలీవుడ్ టాప్ 6 హిట్‌గా నిలిచింది. ఇక ఈ ఏడాది టాప్ 7 హిట్ అంటే నాని 'సరిపోదా శనివారం' సినిమానే చెప్పుకోవాలి. ఈ చిత్రం వందకోట్ల వసూళ్లను రాబట్టి, 'దసరా' తర్వాత నాని కెరీర్‌లో వందకోట్లు సాధించిన రెండో సినిమాగా నిలిచింది. వివేక్ ఆత్రేయ ఈ చిత్రానికి దర్శకుడు. ఆ విధంగా ఈ ఏడాది ఆడియన్స్‌ను ఆకట్టుకోవడంలో ఈ ఏడు సినిమాలు అగ్రభాగాన నిలిచాయి.

కొత్త కథలకు పట్టాభిషేకం

కొందరు దర్శకుల ఆలోచనలు ఈ ఏడాది కొత్త పుంతలు తొక్కాయి. కొత్త కథలకు ప్రేక్షకులు పట్టాభిషేకం చేశారు. వాటిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన సినిమా 'కల్కి 2898ఏడి'. భాగవత, మహాభారతాలను ప్రేరణగా తీసుకొని, దానికి సైన్స్ ఫిక్షన్‌ని జోడించి, నాగ్‌అశ్విన్ తెరకెక్కించిన ఈ సోషియో ఫాంటసీ అద్భుతంగా అలరించింది. దశావతారాల్లో చివరిదైన 'కల్కి' ఆగమనం కోసం ఆడియన్స్ ఎదురు చూసేలా చేసింది. సెకండ్ పార్ట్ కోసం ప్రస్తుతం ప్రేక్షకులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ప్రభాస్, అమితాబ్‌ల నటన గురించీ, నాగ్‌అశ్విన్ హాలీవుడ్ టేకింగ్ గురించి దేశవ్యాప్తంగా మాట్లాడుకున్నారు. టాలీవుడ్ ఖ్యాతిని మరోస్థాయిలో నిలబెట్టిన సినిమా ఇది.
అసలు ఏ మాత్రం అంచనాలు లేకుండా విడుదలై అందరికీ స్వీట్ షాక్ ఇచ్చిన సినిమా కిరణ్ అబ్బవరం 'క'. కర్మసిద్ధాంతం నేపథ్యంలో దర్శక ద్వయం సుజిత్, సందీప్ ఈ చిత్రాన్ని మలిచారు. తెలుగుతెరపై ఇప్పటివరకూ రాని అద్భుతమైన కాన్సెప్ట్ ఇది. అతి తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.53 కోట్ల వసూళ్లను సాధించి హీరోగా కిరణ్ అబ్బవరానికి స్టార్ స్టేటస్‌ని కట్టబెట్టింది. ఈ ఏడాది వచ్చిన మరో విభిన్న కథ 'గామి'. మాస్ హీరో విశ్వక్‌సేన్ చేసిన ప్రయోగం ఈ సినిమా. వింత వ్యాధితో బాధపడుతున్న ఓ అఘోరా సాహస ప్రయాణమే ఇతివృత్తంగా దర్శకుడు విద్యాధర్ కాగిత తెరకెక్కించిన ఈ చిత్రం క్రిటిక్స్ ప్రశంసలందుకుంది.

డబ్బింగ్ సినిమాల జోరు

భాషాభేదాలకు అతీతంగా కథా బలమున్న సినిమాలకు తెలుగు ప్రేక్షకులు పట్టం కడతారు. అందుకే మన దగ్గర డబ్బింగ్ చిత్రాలకు ఆదరణ ఎక్కువ. ప్రస్తుతం పాన్ ఇండియా ట్రెండ్‌లో డబ్బింగ్ సినిమాల తాకిడి మరింత ఎక్కువైంది. ఈ ఏడాది తమిళ, కన్నడ, మలయాళ చిత్రసీమల నుంచి పదుల సంఖ్యలో డబ్బింగ్ సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో అమరన్, మహారాజ, సత్యం సుందరం, ప్రేమలు, మంజుమ్మల్ బాయ్స్, రాయన్, తంగలాన్, భ్రమయుగం చిత్రాలు మంచి విజయాల్ని సాధించాయి. భారీ అంచనాలతో వచ్చిన సూర్య 'కంగువా', కమల్‌హాసన్ 'భారతీయుడు-2', రజనీకాంత్ 'వేట్టయాన్', దళపతి విజయ్ 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్', ఉపేంద్ర 'యుఐ', విజయ్ సేతుపతి 'విడుదల-2' చిత్రాలు ప్రేక్షకుల్ని మెప్పించలేకపోయాయి. ఎడారి జీవితంలోని వ్యథలను దృశ్యమానం చేస్తూ యథార్థ కథతో రూపొందించిన పృథ్వీరాజ్ సుకుమారన్ 'ఆడుకాలం' చిత్రానికి మంచి ప్రశంసలైతే దక్కాయి కానీ బాక్సాఫీస్ బరిలో ఆశించిన ఫలితాన్ని సాధించలేకపోయింది. ఈ ఏడాది 60కి పైగా అనువాద చిత్రాలు తెలుగు ప్రేక్షకుల్ని పలకరించగా..అందులో పది వరకు మాత్రమే మంచి ఫలితాలను సాధించాయి.

విజయాల బాటలో నాయికలు..

ఈ ఏడాది అగ్ర కథానాయికలను మంచి విజయాలు వరించాయి. రష్మిక మందన్న (పుష్ప-2), దీపికా పదుకొణె (కల్కి), జాన్వీకపూర్ (దేవర), మీనాక్షి చౌదరి ('గుంటూరు కారం', 'లక్కీభాస్కర్'), శ్రీలీల (గుంటూరు కారం), అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్) సినిమాల ద్వారా మంచి విజయాలను అందుకున్నారు. ఈ ఏడాది అగ్ర నాయికలు సాయి పల్లవి, అనుష్క, పూజా హెగ్డే తెలుగు తెరపై కనిపించలేదు. అయితే తమిళ డబ్బింగ్ చిత్రం 'అమరన్'తో సాయిపల్లవి తెలుగు ప్రేక్షకులను మెప్పించింది.

...✍ సినిమా డెస్క్

మోగిన పెళ్లి బాజాలు

ఈ ఏడాది పెళ్లి పీటలెక్కిన స్టార్లు చాలా మందే ఉన్నారు. వారిలో నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల మ్యారేజ్ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అని చెప్పాలి. డిసెంబర్ 5న ఈ జంట పెళ్లిపీటలెక్కింది. అలాగే అగ్ర దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కూడా మరోసారి వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ప్రీతి చల్లా అనే డాక్టర్‌ని ఆయన ఈ ఏడాది రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నారు. ఇక ఈ ఏడాది అందరి దృష్టిని ఆకర్షించిన వివాహాల్లో హీరో సిద్ధార్థ్, తెలంగాణ అమ్మాయి అదితి రావు హైదరీ వివాహం ఒకటి. కొన్నాళ్లుగా రిలేషన్‌లో ఉన్న వీరిద్దరూ ఇటీవలే వనపర్తి దగ్గర్లోని చారిత్రాత్మక దేవాలయంలో పెళ్లి చేసుకున్నారు. అలాగే స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కూడా ఈ ఏడాదే తన చిరకాల స్నేహితుడు ఆంటోనీని పెళ్లాడి, వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'రాజావారు రాణిగారు' సినిమాతో ప్రేక్షకులను అలరించిన జంట కిరణ్ అబ్బవరం, రహస్య. వీరిద్దరూ ఈ ఏడాదే వివాహబంధంలోకి అడుగుపెట్టారు. కీరవాణి తనయుడు శ్రీసింహా, మురళీ మోహన్ మనవరాలు రాగ వివాహం గురించి ఈ ఏడాది విశేషంగా చెప్పుకొన్నారు. అలాగే రకుల్ ప్రీత్‌సింగ్, జాకీ భగ్నానీల వివాహం కూడా ఈ ఏడాదే జరిగింది. వరలక్ష్మీ శరత్‌కుమార్, నికోలయ్ సచ్‌దేవ్‌లు ఈ ఏడాదే వివాహ బంధంతో ఒకటయ్యారు. నటి మేఘా ఆకాశ్ తన ప్రియుడు సాయి విష్ణుని పెళ్లాడింది కూడా ఈ ఏడాదే.

"వివాదాల ఊబిలో..

ఈ ఏడాది తెలుగు చిత్రసీమను వరుస వివాదాలు వెంటాడాయి. యువ హీరో రాజ్‌తరుణ్ మీద లావణ్య అనే యువతి చీటింగ్ కేసు పెట్టింది. జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ కేసులో అరెస్టయిన జానీ మాస్టర్ ఇటీవలే బెయిల్‌పై బయటికొచ్చాడు. అయితే ఈ కేసు కారణంగా జాతీయ అవార్డును కేంద్రం వెనక్కి తీసుకోవడంతో జానీ మాస్టర్ ఆవేదన చెందాడు. ఎక్స్ అకౌంట్‌లో ఫొటో మార్ఫింగ్ వ్యవహారంలో అగ్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మను అరెస్ట్ చేయడానికి ఏపీ పోలీసులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సీనియర్ నటుడు మోహన్‌బాబు కుటుంబ అంతర్గత వివాదాలు ఒక్కసారిగా బయటపడటం టాలీవుడ్‌లో కలకలం రేపింది. మోహన్‌బాబు, ఆయన తనయుడు మనోజ్ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. తన ఇంటివద్ద ఓ మీడియా ప్రతినిధిపై మోహన్‌బాబు దాడి చేయడంతో ఈ కేసు అనూహ్యమైన మలుపు తీసుకుంది. ప్రస్తుతం ఈ కేసు నడుస్తున్నది. ఇక అగ్ర నటుడు నాగార్జున కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాలను షాక్‌కి గురిచేశాయి. ఈ సమయంలో సినీరంగం యావత్తు నాగార్జునకు బాసటగా నిలిచింది. ఇక ఈ ఏడాది సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. నాంపల్లి కోర్టు అల్లు అర్జున్‌కు 14 రోజుల రిమాండ్ విధించగా, ఆయన మధ్యంతర బెయిల్‌పై బయటకొచ్చారు. ఈ వ్యవహారంలో అల్లు అర్జున్‌కు ఇండస్ట్రీ నుంచి పూర్తి మద్దతు లభించింది. అలాగే నటి కస్తూరి తెలుగువారిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. మొత్తంగా ఈ ఏడాది టాలీవుడ్ వరుస వివాదాలతో జాతీయ స్థాయిలో వార్తల్లో నిలిచింది.

అమ్మ భయం అదే!

తాము సెలెబ్రిటీల వారసులమైనా.. సాధారణ పిల్లల్లాగే పెరిగామని చెబుతున్నది శృతి హాసన్. అందుకే.. పెద్ద ఇల్లు, చుట్టూ ఎన్నో కార్లు ఉన్నా.. వాటిని చూసి తామెప్పుడూ గర్వాన్ని ప్రదర్శించేవాళ్లం కాదని అంటున్నది. అగ్ర కథానాయకుడు కమల్‌హాసన్-సారిక దంపతుల గారాలపట్టి అయిన శృతి ఇటీవల ఒక ఆన్‌లైన్ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన వ్యక్తిగత జీవితం, తన బాల్యంతోపాటు తల్లిదండ్రులు నేర్పించిన విలువల గురించి చెప్పుకొచ్చింది. 'చిన్నప్పటి నుంచే మా చుట్టూ క్రమశిక్షణతో కూడిన వాతావరణం ఉండేది. 'పాకెట్ మనీ' అనే కాన్సెప్ట్ మా ఇంట్లోనే లేదు. అన్నీ మేమే సంపాదించుకోవాలి. 'ఇంత పెద్ద ఇల్లు. ఇన్ని కార్లతో పిల్లలు చెడిపోతారు..' అని మా అమ్మ ఎప్పుడూ భయపడేది. అందుకే, మేమంటే ఎంత ప్రేమగా ఉండేదో.. అంతే కఠినంగా వ్యవహరించేది!' అంటూ చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా.. తన బాల్యంలో జరిగిన ఒక సరదా సంఘటననూ పంచుకున్నది. 'ఎవరి బర్త్‌డే అయినా.. మా స్నేహితులంతా ఫ్యాన్సీ చాక్లెట్లు పంచేవారు. ఓసారి నా పుట్టిన రోజు నాడు మాత్రం.. మా అమ్మ బెల్లం-పల్లీలతో చేసిన చిక్కీ లడ్డూలను పంపించింది. వాటిని చూసిన నా స్నేహితులంతా నవ్వుకున్నారు. 'మీ నాన్న సినిమా హీరో అని చెబుతావు కదా!? మరేంటి ఇలాంటి స్వీట్ తీసుకొచ్చావు?' అంటూ ఎగతాళి చేశారు' అని చిన్ననాటి సంగతిని పంచుకుంది శృతి హాసన్. 'ఇలాంటి సన్నివేశాలు ఎన్ని ఎదురైనా.. వాటన్నిటి లోనూ మాపై అమ్మకు ఉండే ప్రేమ, బాధ్యతే కనిపించేది!' అని అంటున్నది. ఇక చిత్రసీమలో తన ఎదుగుదలకు తండ్రి కమల్ హాసన్ పేరును ఎక్కడా వాడుకోలేదని వెల్లడించింది. 'నా ఇంటిపేరు నాకు ఓ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిన మాట వాస్తవమే! కానీ, అది కేవలం అప్పుడప్పుడూ విమానాశ్రయాలలో క్యూలైన్‌లను తప్పించుకోవడానికి మాత్రమే ఉపయోగపడేది' అని తెలిపింది. కమల్‌హాసన్ స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'హేరామ్' చిత్రంలో అతిథి పాత్రతో తెరంగేట్రం చేసిన శృతి.. ఒక దశలో దక్షిణాదిలో అగ్ర కథానాయికగా వెలుగొందింది. ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తున్న 'కూలీ' చిత్రంలో రజినీకాంత్‌తో కలిసి నటిస్తున్నది.

'ఓ బావ సైదులు' అంటూ ఫోక్ సాంగ్ ఫ్యాన్స్‌ని పలకరించిన నిర్మల్ ఆడబిడ్డ ఇప్పుడు పాన్ ఇండియా సింగర్. 'పుష్ప-2'లో 'వచ్చుండాయ్ పీలింగ్స్' పాటతో అందరిలోనూ ఫీలింగ్స్ పుట్టించిందామె గొంతుక. సింగిల్ సాంగ్‌తో ప్రపంచమంతా సందడి చేస్తున్న ఆ గళం పేరు దాస లక్ష్మి. పల్లెలో పుట్టి, పాటలో పెరిగి, ఎంతపేరు మూటగట్టుకున్నదో 'జిందగీ'తో ముచ్చటగా పంచుకున్నది! ఆ సంగతులు ఆమె మాటల్లోనే..

పుష్ప సింగర్ మనోడే

మా అమ్మ జైశీల, నాన్న లక్ష్మణ్ పాటలు బాగా పాడేటోళ్లు. పొలం పనులు చేసుకుంటనే భజన కీర్తనలు ఆలపించేటోళ్లు. ఆ (అను)రాగాలు ఆలకిస్తూ పెరిగాను. కాబట్టి నాకు చిన్నప్పుడే పాడాలనే కోరిక కలిగింది. మా ఊరు నిర్మల్ జిల్లా ముథోల్ మండలం గన్నోర. అక్కడే ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకున్న. బడిలో పంద్రాగస్టుకు, గణతంత్ర దినోత్సవానికి నాతో పాటలు పాడించేటోళ్లు. శశికళ మేడం, ప్రవీణ్ రెడ్డి సార్, రాములు సార్ నా పాటలు మెచ్చుకునేటోళ్లు. ఎక్కడ పాటల పోటీలు ఉన్నా తీసుకపోయేటోళ్లు. ఏడో తరగతి చదువుతున్నప్పుడు తిరుపతిలో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినయి. అప్పుడు మండల, జిల్లా స్థాయి పాటల పోటీల్లో గెలిచిన.

ధూం ధాం పాటలు

తొమ్మిదో తరగతి చదవడం కోసం అష్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరాను. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నది. 'తెలంగాణ ధూం ధాం' సభలు బాగా జరిగేటివి. మా బడిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలో పాట పాడిన. దిగంబర్ అన్న నా పాట విని మెచ్చుకున్నడు. ఆయన నాకు పాట పాడుట్ల మెలకువలు నేర్పిండు. ఆ అన్నే 'ధూం ధాం', యూత్ ఫెస్టివల్స్‌కి నన్ను తీస్కపోయేటోడు. జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌లో నాకు రెండో స్థానం లభించింది. అప్పటినుంచి పాటను వదిలిపెట్టలే.

ఆనాడు సైదులు.. ఈనాడు పుష్ప

డిగ్రీ ఫస్ట్ ఇయర్‌ల ఉన్నప్పుడు.. ఫ్రెండ్స్ యూట్యూబ్ పాటలు వినేటోళ్లు. నాకు అప్పటికి ఫోన్ లేదు. వాళ్ల ఫోన్‌లోనే వినేదాన్ని. 'గడ్డం మ్యూజిక్' అనే చానెల్ పాటలు విన్న. అవి బాగున్నయి. ఆ చానల్ నడిపే గడ్డం రమేశ్ అన్నను కలిసిన. ఆయన నాతో ''ఓ బావ సైదులు'' పాట పాడించారు. ఆ ఒక్కపాటతో ఫోక్ సాంగ్ ఫ్యాన్స్‌లో పాపులర్ అయ్యాను. ఆ తర్వాత యూట్యూబ్ చానెల్స్‌కి లెక్కలేనన్ని పాటలు పాడాను. ఫోక్ మ్యూజిక్ డైరెక్టర్ జీఎల్ నామ్‌దేవ్ సార్ పాటను ఏ శ్రుతిలో పాడాలి? ఎట్ల ఎత్తుకోవాలో బాగా నేర్పిండు. వందల పాటలు పాడిన. మాట తిరుపతి అన్న నడిపే సైటీవీ చానెల్‌లో పాడిన 'ఆనాడేమన్న అంటినా తిరుపతి.. నిన్ను ఈనాడేమన్న అంటినా తిరుపతి' పాటతోపాటు 'తిన్నా తిరం పడుతలే.. కూసున్న తిరం పడుతలే' పాటలు యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నయి. ఆ పాటలు సినిమా డైరెక్టర్ సుకుమార్ సార్ విన్నారు. 'ఈ అమ్మాయి వాయిస్ బాగుంది. మాస్‌గా, రొమాంటిక్‌గా, మంచి బేస్‌లో ఉంది. పుష్ప 2లో పాడిద్దామనుకుంటున్నా' అని తిరుపతి అన్నకు ఫోన్ చేసి చెప్పాడట. అలా నన్ను చెన్నైకి పిలిపించారు డైరెక్టర్ సార్. దేవీశ్రీప్రసాద్ గారి సంగీత దర్శకత్వంలో 'పీలింగ్స్' పాట పాడిన. ఈ పాట నన్ను చెప్పలేనంత పాపులర్ చేసింది. ఇప్పుడు దాస లక్ష్మి అంటే తెలియనోళ్లు లేరు.

పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అల్లు అర్జున్ సార్, సుకుమార్ సార్ నన్ను పిలిచి, 'అమ్మా లక్ష్మి నీ టోన్ వెరీ డిఫరెంట్. మా సినిమాలో ఈ పాటకు ఏ ఫీల్ కావాలో ఆ ఫీల్ నీ గొంతులో ఉంది. నువ్వు మాస్ పాటే కాకుండా అన్ని రకాల పాటలు పాడగలవు' అని మెచ్చుకున్నారు. ఈ ప్రశంస నాకెంతో స్ఫూర్తినిచ్చింది. ఆ ఫీలింగ్ ఎప్పటికీ మర్చిపోలేను. పుష్ప సినిమాకు ముందు కొన్ని సినిమాలకు పాడిన. రఘు కుంచె గారు నాకు మొదటిసారి సినిమాలో పాడే చాన్స్ ఇచ్చారు. 'బ్యాచ్' సినిమాలో 'గుంటడు గుళ్లో కాసేనే' పాట పాడించారు. ఆ పాట కోస్తాలో పాపులర్ అయింది. తర్వాత దసరా సినిమాలో కాసర్ల శ్యామ్ అన్న అచ్చమైన తెలంగాణ యాసలో టైటిల్ సాంగ్ 'ధూమ్ ధామ్ దోస్తాన్' పాడించారు. పుష్ప-2 తర్వాత అవకాశాలకు కొదవలేకుండా పోయింది. వాటిని సద్వినియోగం చేసుకొని మంచి సింగర్‌గా గుర్తుండిపోవాలన్నది నా కోరిక.

...✍ గుళ్లపెల్లి సిద్ధార్థ గౌడ్

రైలులో పెళ్లికి..

సామాన్యులకు రైలు ప్రయాణం సాధారణ విషయమే! సెలెబ్రిటీలు రైళ్లలో వెళ్తే మాత్రం.. అది సెన్సేషనే! తాజాగా, బాలీవుడ్ భామ నోరా ఫతేహి చేసిన రైలు ప్రయాణం.. ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. తన మిత్రుడు, క్రియేటివ్ డైరెక్టర్ అనూప్ సర్వే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు రైల్‌లో ప్రయాణించింది నోరా. ఇందుకు సంబంధించి ముంబయిలోని దాదర్ రైల్వే స్టేషన్‌లో ఉన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. రైల్‌లోనే రత్నగిరికి చేరుకున్న నోరా.. డైరెక్టర్ హల్దీ వేడుకలో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఆమె చేసిన డ్యాన్స్ వీడియో కూడా నెట్టింట చెక్కర్లు కొడుతున్నది. డైరెక్టర్ అనూప్‌తో తనకు ఎనిమిదేళ్లుగా పరిచయం ఉన్నదనీ, 2017 నుంచి తన సినీ ప్రయాణంలో అనూప్ తోడుగా ఉన్నాడనీ రాసుకొచ్చింది. కెనడాలో పుట్టిపెరిగిన నోరా ఫతేహి.. నటనపై ఆసక్తితో భారత్‌కు వచ్చింది. ఎంతో కష్టపడి సినిమాల్లో అవకాశాలు దక్కించుకున్నది. బాహుబలిలో 'మనోహరి' పాట.. నోరా కెరీర్‌నే మలుపు తిప్పింది. ఆ తర్వాత 'సత్యమేవ జయతే' సినిమాలోని 'దిల్బర్ దిల్బర్' రీమిక్స్ పాటతో.. దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నది. ప్రస్తుతం ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న 'కేడీ-ద డెవిల్' చిత్రం ద్వారా కన్నడలో అరంగేట్రం చేస్తున్నది నోరా ఫతేహి.